# వెర్రిచాకిరి

ఏమీ తోచక తలుపు తీసి బయటనిలబడ్డాను. రకరకాల మనుష్యుల్ని, వారి నడకల్ని, రంగురంగుల కార్లని, వాటి శబ్దాలని చూస్తూ, వింటూ పరధ్యానంగా వున్న నాకు "బాగున్నారా అమ్మగారూ" అన్న మాటలు వినిపించాయి. అటు తిరిగాను. సైకిలాపి దిగి నాకేసి చూస్తూ నవ్వుతూ పలకరిస్తున్నాడు రాములు.

"ఏం రాములూ నువ్వా! ఎవరో అనుకున్నా, ఏమిటిలా చిక్కావు.

"నేనేం చిక్కానమ్మగారు. సుబ్రంగా వున్నాను" అన్నాడు.

"ఎక్కడా ఉద్యోగం? అదే ఆఫీసా, పని బాగుందా, గంగ ఎలావుంది?" అన్నాను.

వాడు తెలివిగా తలూపాడు.

"ఏరా, అస్సలు కనిపించటమే మానేశావు. ఆఫీసుకు వెళ్తూనో, వస్తూనో ఒక్కసారి కనిపించి పోవచ్చుగా".

"నిజమేనమ్మగారు! ఎక్కడా వద్దామన్నా, తీరిక లేకుండాపోయింది" అన్నాడు బుర్రగోక్కుంటూ.

రాములు మునుపు మా యింట్లో పని చేసేవాడు. బుద్ధిమంతుడు నిజాయితీ పరుడు.

వెయ్యి వరహాలు ఎదురుగా పెట్టినా చలించని మనసున్నవాడు అందుకే మా వారు వాడిని తన ఫ్రెండుకు తెలుసున్న ఆఫీసులో ప్యూనుగా వేయించారు. వాడెప్పుడు కనిపించినా ఆ కృతజ్ఞతతో కళ్ళు మెరిసిపోతూ మాట్లాడుతాడు.

"అయ్యగారెప్పుడొస్తారండీ" రాత్రి ఏడు కావస్తుంది ఆయన వచ్చేసరికి. అది

సరేగాని నీ ఉద్యోగంలో చేరాక రానే లేదు. విశేషాలు చెప్పు" అన్నాను, రాములు ఏం చెప్పినా వినసొంపుగా చెప్తాడు, తోచకుండా వున్నా నాకు కాస్సేపు వాడి మాటలు వింటే బాగుండును అనిపించింది.

వాడు సైకిల్ స్టాండు వేసి...

"ఏముందండమ్మగారు. నాది ఆఫీసు డ్యూటీ కాదండి. మన్ది ఓం డిపార్టు మెంటండీ" అన్నాడు నవ్వుతూ.

"అంటే" అన్నాను.

"ఎందుకండి, నా వుద్యోగం పదింటి నుంచి అయిదింటిదాకా కాదండి. తెల్లారగట్ల అయిదింటి నుంచి రాత్రి పదింటిదాకా నండి" అన్నాడు హాయిగా నవ్వుతూ.

వాడి మాటలకి నాకు నవ్వొచ్చింది.

"ఏం చేస్తావురా అంతసేపు" అన్నాను.

"నాలుగున్నరకి లేస్తానండి. పల్లుతోమి, పాలబూత్‌కి లగెత్తుతానండి. నాలుగు సీసాలపాలు పట్టుకొని అయ్యగారింటికి పోతానండి. ఎళ్ళడమే ఎళ్ళడం - కుళాయి నీళ్ళు అన్నింటా పట్టేస్తానండి, అంట్లు తోమేసి, దొడ్డి గట్టా చిమ్మేస్తానండి, తెల్లతెల్లారు తుంటే బాయిలర్ అంటించి పడేస్తానండి. ఇంతలో అమ్మగారు లేచి, పాలు కాస్తారండి, నాకో గలాసుడు కాపీ పోస్తారండి మళ్ళీ నేను, పక్కలన్నీ యెత్తి, గదులన్నీ తుడుస్తానండి - అమ్మగారికి కూరలు తెచ్చి, ఆమె సెప్పినయి తరిగి పెట్టేస్తానండి. అబ్బాయిగారు లేస్తారండి - ఇంక అక్కడనుంచి ఒక్కొక్కరికే నీళ్ళు - ఏడేడి నీళ్ళు యిచ్చేస్తానండి - అమ్మగారు టిఫిన్ తయారగుద్ది - అంతా తింటారు. నాకూ పెడతారు - నిజమమ్మ గారు, మా అమ్మ గారికి చేతికి ఏముక లేదు - ఆ ప్లేట్లు, అయ్యి కడిగేసి టేబులు తుడిచేసి ఓ పక్కన నిలుసుంటానండి. అయ్యగారు లేస్తారండి - ఆరికి బ్రష్, పేస్టూ, గడ్డానికి సామాను, వొక్కటేటండీ - మరన్నీ నేనే నండి" అంటూ బుర్రగోక్కుని, "అదై పోతదండి, అమ్మాయిగార్ని, అబ్బాయిగార్ని సైకిలు మీద స్కూలు కాడ దిగబెట్టి వస్తానండి, మళ్ళేదైనా బజారుపని చేస్తానండి, అమ్మగారు వంట సేస్తుంటే అల్లం మసాలా నూరిస్తానండి. బియ్యం కడిగిస్తానండి. ఆ యమ్మగారు కూరుసుంటే డబ్బాలు, సీసాలు - హాహటేమిట అన్నీ యిస్తానండి - అయితే చేతికి ఎముక లేదండి. ఏం చేసినా "వొరే రాములూ" అని పెట్టకుండా ఉండదండి"-

"మధ్యాహ్నం పిల్లలకి అన్నాలు తీసుకెళ్తానండి - అయ్యగారికి కాఫీ టిఫిన్

తీసుకెళ్ళి యిస్తానండి, పిల్లల్ని మళ్ళీ స్కూలు నుండి తీసుకొస్తానండి– అయిదింటి లోపల పెద్దక్లార్కు గారికి ఓ పాలి కనబడి మస్తరేయించుకొస్తానండి – రాత్రి వంట మూడొంతులు నేనే సేస్తానండి, పక్కలు వేసి పిల్లల్ని పడుకోపెడతానండి, అమ్మగారు, అయ్యగారు తిన్నాక అన్నీ సర్దేసి, అన్నం క్యారేజిలో పెట్టేసుకుని పదింటికి యింటికి నడుస్తానండి – అంటే – యింటికాడ గంగ వుంటది కదండి. యీ మంచికూరలు అది తినకుండా నాగొంతు దిగదండి అందుకే – అట్టా సేస్తానండి, ఈ వేళ అమ్మగారు వూరెళ్ళారండి – గంగ కోడిమాంసం తెమ్మందండి – వత్తానండమ్మగారు మళ్ళీ వొత్తానండీ" రాములు సైకిల్ పెడలు మీద బలంగా కాలు వేశాడు –

("అనామిక" మాసపత్రిక నుండి)